హైదరాబాద్ వార్త

## కేపీహెచ్‌బీలో చోరీ చేసి.. మాదాపూర్‌లో దొరికి.. మళ్లీ చోరీచేసి..

**పోలీస్‌స్టేషన్ నుంచి వాహనం చోరీ**

**కేపీహెచ్‌బీ ప్రాంతంలో బైక్‌ను చోరీ చేసిన దొంగ**

**మాదాపూర్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన దొంగ**

**పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన బైక్‌ను మళ్లీ ఎత్తుకెళ్లిన దొంగ**

**పోలీసులకు చుక్కలు చూపించాడు**

హైదరాబాద్, గచ్చిబౌలి, నవంబరు 19 ప్రభాతవార్త : మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి వాహనం చోరీ కావడం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే ఒకవ్యక్తికి సంబంధిం చిన బైక్ శుక్రవారం కేపీహెచ్‌బీ పరిధిలో చోరీకి గురైంది. దీంతో వాహన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో రాత్రి మాదాపూర్‌లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తుండగా బైక్‌తో సహా దొంగ పట్టుబడ్డాడు. దీంతో వాహనాన్ని జప్తు చేసిన పోలీసులు దాన్ని మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఎవరూ లేని సమయాన్ని చూసుకుని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి దుండగుడు బైక్‌ను దొంగిలించి పారిపోయాడు, మరోవైపు చోరీ విషయం గురించి తెలియని పోలీసులు వాహన యజమానికి ఫోన్ చేసి మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సింది గా కోరారు. ఆయన అక్కడకు వెళ్లి చూసే సరికి బైక్ లేదు. దీంతో ఆయనతో పాటు పోలీసులు సైతం షాక్‌కు గరయ్యారు.

## అద్భుత నృత్యాలతో ఉర్రూతలూగించిన విద్యార్థినులు

**తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని యావత్ దేశం హర్షిస్తుంది : మంత్రి మల్లారెడ్డి**



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలోని దృశ్యాలు

నాంపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త : గత 8ఏళ్లక్రితం నూతనంగా దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తూ ఎన్నోరంగాల్లో దేశంలోనే నంబరు రాష్ట్రంగా నిలుస్తూ ఆదర్శం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకంగా నిలుస్తోందని, దేశం మొత్తం రాష్ట్ర అభివృద్ధిని గమనిస్తుందన్న తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీ ఎర్రకోటపై బిఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమానూ వ్యక్తం చేశారు. అవంతి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఏపి మాజీమంత్రి, అవంతి డిగ్రీ, పీజి కళాశాలల ఛైర్మన్, ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తదితరులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లారెడ్డి తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత హైదరబాద్ ఐటి హబ్‌గా మారిందని, యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని తెలియజేస్తూ రానున్న రోజుల్లో భారతదేశ యువత ప్రపంచాన్ని శాసించేస్థాయికి తప్పక ఎదుగుతుందని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ఉల్లాసభరితంగా జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు శాస్త్రీయ, జానపద, ఆధ్యాత్మిక, సినీ నృత్యాలతో వైభవోపేతంగా ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకొని ఉర్రూతలూగించాయి.

## సత్యనారాయణ స్వామి వ్రతం ఎంతో మహిమ గలది

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



బండ కార్తికరెడ్డి నివాసంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బిజెపీ నేతలు

తార్నాక, నవంబర్ 19 ప్రభాతవార్త: సత్యనారాయ స్వామి వ్రతం ఎంతో మహిమ గల వ్రతం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని మాజీ మేయర్ బండ కార్తికచంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమానికి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య రెడ్డి తో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిదంగా మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, నందీశ్వర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, గౌతమ్ జీ, కార్పోరేటర్లు పద్మ వెంకట్‌రెడ్డి, పద్మా వెంకట్‌రెడ్డి, సుప్రియ నవీన్ గౌడ్, అమృత,శ్రవణ్, కొంతం దీపిక, శ్రీవాణి, కొప్పుల నర్సిహ్మారెడ్డి, శ్రీవాణితో పాటు పలువురు సికింద్రాబాద్ నియోజక వర్గం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే మానసిక, శారీరక, ఆధ్యాత్మికంగా దృఢంగా ఉండాలి

**నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి**



మాట్లాడుతున్న డీసీపీ చందనాదీప్తి

బేగంపేటనవంబరు 19,ప్రభాతవార్త : ఒక ఉత్తమ పౌరుడిగా ఎదగాలంటే మానసిక, శారీరక, ఆధ్యాత్మిక దృఢత్వం తప్పని సరి అని నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి అన్నారు. విధ్యార్థులు మైదానంలో చూపుతున్న అంకితభావం పట్టుదలని కొనియాడారు.హెచ్‌పీఎస్ జెండాను ఎగుర వేయాలని ఆమె విధ్యార్థులను కొనియాడారు.బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూలు 99వ వార్షికోత్సవ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఎంతో ఘనంగా నిర్వహించింది. పాఠశాల విద్యార్థుల క్రీడా ప్రతిభకు బసలత్ జా స్టేడియం వేదికగా నిలిచింది.ఈ క్రీడా దినోత్సవానికి ముఖ్య అతిధిగా నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.డీసీపీకి బోర్డు గవర్నర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ్ దేవ్ సరస్వత్ స్వాగతం పలికారు.ముఖ్య అతిధిగా హాజరైన డీసీపీ ముందుగా మీట్ జ్యోతి ని వెలిగించి స్కూల్ కెప్టెన్లు ఐశ్వర్యరెడ్డి,రాజ్ లలిత్ చాలలకు అందజేసారు. అనంతరం జెండాలను ఎగుర వేసి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు తక్షశిల,నాగార్జున,నలంద,విజయనగర బృందాలుగా ఏర్పడి ఆయా క్రీడా పోటీలలో ఒకరి కొకరు పోటీ పడ్డారు.పాఠశాల లోని హార్స్‌రైడింగ్ క్లబ్ కు చెందిన విద్యార్థులు గుర్రాలపై విన్యాసాలు చేసి అలరించారు.శాంతికి చిహ్నమైన పావురాలను గగన తలంలోకి విడిచి పెట్టారు.ఈ వేడుక సందర్భంగా హెడ్ బాయ్ అంకిత్ సుహాస్ రావు,హెడ్ గర్ల్ రియా అబ్రహం నాలుగు కలర్ హౌస్‌ల నేతృత్వంలో మార్చి ఫాస్ట్ జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ పీ ఎస్ సొసైటీ అధ్యక్షులు ఫయాజ్ ఖాన్,సభ్యులు, రిజిస్ట్రార్ కల్నల్ పి.ఎల్ఎన్‌శర్మ బాలబాలికలు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దేవుళ్లందరూ సమానమే : స్వామి డాక్టర్ ఉమాకాంత్ సరస్వతి

బేగంపేట నవంబరు 19,ప్రభాతవార్త : హిందూ మతంలో ఎంతో మంది దేవుళ్ల ఉన్నా ఒకరు చిన్నా, ఒకరు పెద్దా అనే తేడా ఏమి లేదని,దేవుళ్లందరూ సమానమేనని అందరం చివరికి చేరుకునే గమ్యం ఒకటేనని హరిద్వార్ కు చెందిన మహా మండలేశ్వర స్వామి డాక్టర్ ఉమాకాంత్ అన్నారు.శని వారం రాత్రి మినిస్టర్ రోడ్డు లోని ఇలాచి రెస్టారెంట్‌లో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమం లో ఆయన పాల్గొని వివిధ అంశాలపై ప్రవచనాలు అందించారు.ప్రాచీన యోగా సాంప్రదాయం,పురావస్తు మన సంస్కృతి, ఆయుర్వేద రత్నాలు తదితర అంశాలపై ప్రవచనాలు వినిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో అనేక దేవతలు,మార్గాలు ఉన్నాయని కానీ ఎవరు ఏదేవుడిని అనుసరించినా అందులో తప్పులేదని, చివరికి అందురూ చేరుకునేది ఒకటే మార్గమని అన్నారు.సంజయ్ దుగ్గడ్,అశోక్‌గాంధీ, మహేష్‌జైన్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు,భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంత రావు, హిందూ సంఘాల ప్రతినిధులు మహేష్ గుప్తా,మనోజ్ ప్రసాద్,జిగ్నేష్ జోషి,గోవిందరాఠి పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో జివిఆర్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ




గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ కనపరిచిన జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు



హైదరాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త : గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన జీవిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనపరిచి పలు అవార్డులు, రివార్డులు సాధించారు. ఈ పోటీల్లో 27 మంది విద్యార్థులు పాల్గొని అందులో 25 మంది పథకాలు సాధించారు. వీరిలో ఐదుగురు బంగారు పతకాలు, 8 మంది కాంస్య పథకాలు, 12 మంది రజిత పథకాలను సాధించారు.ఇందులో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి చెరుకు హిమకేష్ మెరుగైన ఆటతీరు కనపరిచి కాంస్య పథకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పథకాలను సాధించిన విద్యార్థులను శనివారం జీవిఆర్ కరాటే అకాడమీ ప్రాంగణంలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్,ప్రైవేటు స్కూల్ జేఏసీ చైర్మన్ కోట్ల నిరంజన్‌రెడ్డి పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు.ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవడం వల్ల తనను తాను రక్షించుకుని, దేశానికి రక్షణ కవచంగా నిలవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో ప్రతిభ కనపరచాలన్నారు.పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి, అకాడమీ మాస్టర్స్ సుభాష్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రయ్... రయ్.. రయ్ రేసింగ్ కార్లతో.. దద్దరిల్లిన సాగరతీరం

**ఉత్సాహంగా సాగిన ఇండియన్ రేసింగ్ లీగ్ ❑ భారీగా హాజరైన అభిమానులు**



**తరలివచ్చిన అభిమానులు..**

**రేసింగ్‌ను వీక్షించడానికి పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. నిర్వాహకులు కూడా ప్రేక్షకుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొత్తం 7,500 టికెట్లు అమ్ముడుపోయాయని తెలిపారు. ఈరేసింగ్‌లో మొత్తం 18 మూలమలుపులు ఉండగా ప్రతి మలుపు వద్ద వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే చికిత్స అందించడానికి ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేసి ఉంచారు. మంత్రి కెటిఆర్ ఐమాక్స్ వద్ద ప్రేక్షలతో పాటు నిల్చుని రేసింగ్‌ను వీక్షించారు.**

హైదరాబాద్, నవంబర్ 19, ప్రభాతవార్త: నగరంలోని హుస్సేన్ సాగర్ తీరంలో ఇండియన్ రేసింగ్ లీగ్ ప్రారంభమైంది. స్ట్రీట్ సర్క్యూట్‌పై స్పోర్ట్‌కార్లు రయ్.. రయ్ మంటూ పరుగులు తీశాయి. రేసింగ్‌కి ముందు ట్రయల్ రన్ నిర్వహించగా.. క్వాలిఫైయింగ్ 1,2 తర్వాత రేస్ 1 స్ప్రింట్‌ను మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. 3.10గంటల నుంచి 3.20 గంటల వరకు క్వాలిఫయింగ్-1డ్రైవర్ ఏబృందం, 3.30 నుంచి 3.40 నిమిషాల వరకు క్వాలిఫయింగ్ -2 బి బృందం రేస్ ప్రారంభించింది. సాయంత్రం 4గంటల నుంచి 4.45 గంటల వరకు మెయిన్ రేస్ జరిగింది. 2023 ఫిబ్రవరి 11న జరగనున్న ఫార్ములా భాగంగా ఈరేస్ నిర్వహిస్తున్నారు. ఈరేసింగ్‌లో 12కార్లు, 6బృందాలు, నలుగురు డ్రైవర్లు, మహిళా రేసర్లు పాల్గొన్నారు. 50శాతం దేశంలోని రేసర్లు ,మరో 50శాతం విదేశీ రేసర్లు ఇండియన్ రేసింగ్ లీగ్‌లో పాల్గొన్నారు. పెట్రోల్ కార్లు 240కి.మీ స్పీడ్‌తో వెళ్ళాయని, ఎలక్ట్రిక్ కార్లయితే గరిష్ఠ వేగం 320 కిమీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కాగా ఈరేసింగ్ హైదరాబాద్, బెంగళూరు, గోవా, చెన్నై, కొచ్చి బృందాలు రేసింగ్‌లో పాల్గొన్నాయి.

**సోమవారం వరకు ట్రాఫిక్ ఆంక్షలు..** ఇండియన్ రేసిర్ లీగ్ సందర్భంగా నెక్లెస్‌రోడ్,ఎన్టీఆర్ మార్గ్‌లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఖైరతాబాద్ నుంచి ఐమాక్స్, ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ మార్గ్, లుంబినీ పార్క్, ఎన్టీఆర్ పార్క్ మీదుగా ట్రాక్ తిరిగి ఐమ్యాక్స్ దగ్గర ఉన్న గ్యారేజీకి చేరుకుంటుంది కాబట్టి ఖైరతాబాద్ కూడలి నుంచి ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు నెక్లెస్‌రోడ్, రోటరీ వైపు వెళ్లడానికి అనుమతి లేదు. ఈరూట్ నుంచి వచ్చే వాహనాలను పివిఆర్ విగ్రహం, షాదన్ కాలేజీ, రవీంద్రభారతి వైపు మళ్ళించారు. అలాగే బుద్ధభవన్ నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్‌రోడ్ రోటరీ వైపు వచ్చే వాహనాలను రాణిగంజ్, ట్యాంక్‌బండ్ వైపు మళ్లించారు. రసూల్ పురా, మినిస్టర్ రోడ్ నుంచి నల్లగుట్ట మీదుగా నెక్లెస్‌రోడ్ రోటరీ వైపు వచ్చే వాహనాలను నల్లగుట్ట జంక్షన్ వద్ద రాణిగంజ్ వైపు మళ్లించారు. ఇక్బాల్ మినార్ జంక్షన్ నుంచి తెలుగుతల్లి, ట్యాంక్‌బండ్‌వైపు వెళ్లే వాహనాలను కట్టమైసమ్మ దేవాలయం వైపు మళ్లించారు. బిఆర్‌కె భవన్ నుంచి నెక్లెస్‌రోడ్,రోటరీ వైపు వెళ్లే వాహనాలను తెలుగు తల్లి జంక్షన్ వద్ద ఇక్బాల్ మినార్ -రవీంద్రభారతి జంక్షన్ వైపు మళ్ళించారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. సోమవారం వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.

## 'ఏనీ టైమ్ నో క్యాష్'

**ఏటీఎంలు పనిచేయవు, నగదు ఉండదు**

**నిత్యం సాంకేతిక లోపాలు**

**ఏటీఎంల వద్ద కనిపించని భద్రతా సిబ్బంది**

**ఏటిఎం ఉన్న ప్రాంతంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. హైదరాబాద్ నగరంలో చాలా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఏటీఎంల వద్ద కనీస భద్రత సదుపాయాలు కరువయ్యాయి. సెక్యురిటీ గార్డులను నియమించాల్సిన బ్యాంకింగ్ యాజమాన్యాలు గాలికి వదిలేశాయి. మరికొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, అలారం వంటి వ్యవస్థలు సరిగా పనిచేయకపోవడం తో నగరంలో ఏటీఎం చోరీలు నిత్యకృత్యంగా మారాయి.**




అంబర్‌పేట, ఆలీకేఫ్ చౌరస్తాలోని కెనరా బ్యాంక్ ఎటిఎం

హైదరాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త : నగరంలో బ్యాంకింగ్ రంగానికి చెందిన ఏటీఎంల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగానికి చెందిన బ్యాంకులకు చెందిన దాదాపు 3,500లకుపైగా ఏటీఎంలు నగర వ్యాప్తంగా ఉన్నాయి. వీటిలో సగానికిపైగా ఎప్పుడూ ఏదో ఒక సమస్యతో ఖాతాదారులకు నిరుపయోగంగా ఉంటున్నాయి. చాలా ఏటీఎంలలో ఆయా బ్యాంకులు సమయానికి డబ్బు నింపకపోగా మరికొన్నింటిలో నిత్యం సాంకేతిక లోపాలు తలెత్తుతూనే ఉన్నాయి. సమయానికి పరిష్కరించకపోవడంతో అత్యవసరంగా డబ్బు కావాల్సినప్పుడు ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్ చెల్లింపులు ప్రస్తుతం విపరీతంగా పెరగడంతో అత్యవసరంగా డబ్బు కావాల్సివచ్చినప్పుడు ఖాతాదారులు ఏటీఎంలను ఆశ్రయించక తప్పడం లేదు. తీరా ఏటీఎంల వద్దకు వెళ్లాక 'నో క్యాష్' బోర్డులు కనబడి నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. కొద్ది రోజులుగా నగరంలోని చాలా ఏటీఎంల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మరోవైపు ఈ మధ్యకాలంలో బ్యాంకులు విధించిన పరిమితులతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటీఎంల నుంచి నగదు తీసుకోవడానికి బ్యాంకులు కొన్ని పరిమితులు విధించాయి. ఖాతాదారుని సొంత బ్యాంకు ఏటీఎం నుంచి నెలకు 5సార్లు ఉచితంగా ఆర్థిక లావాదేవీలు వినియోగించుకోవచ్చు. ఇంకా అదనంగా ఆర్థిక లావాదేవీలు చేయాలనుకుంటే ప్రతీ లావాదేవీలపై రూ.20లు, మరియూ జిఎస్‌టీ వసూలు చేస్తారు. ఇతర బ్యాంకు ఏటీఎంల నుంచి 4 పార్లు ఉచితంగా ఆర్థిక లావాదేవీలు జరపడానికి వీలుంటుంది. ఇక్కడ కూడా అదనంగా ఏటీఎం సేవలను వినియోగించుకుంటే రూ.20లు, జిఎస్‌టీ చెల్లించాల్సి వస్తోందని ఖాతాదారులు లబోదిబో మంటున్నారు. తమ ఖాతా ఉన్న బ్యాంకు ఏటీఎంలో డబ్బు లేకపోవడమో.. సాంకేతిక సమస్య తలెత్తడమో జరిగితే ఖాతాదారులు ఇతర ఏటీఎంలకు పరుగులు తీయాల్సి వస్తోంది.దీంతో తమకు అదనపు భారం పెరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. నెలలో 4సార్లు మించి ఇలాంటి పరిస్థితి రావడంతో నగదు తీసుకున్న ప్రతి సారి రూ.20లు, జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి వస్తోందని ఖాతాదారులు అంటున్నారు. ఇలా ఛార్జీలు వసూలు చేస్తూ ఏటీఎంలను సరిగా నిర్వహించకపోవడంతో బ్యాంకుల యాజమాన్యాలపై ఖాతాదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## అయ్యప్ప నామ స్మరణంతో మారుమ్రోగిన మణికొండ గ్రామం



మణికొండ గ్రామంలో సాంప్రదాయబద్దంగా సాగిన హరిహర తనయుడు అయ్యప్ప మహా పడిపూజ

నార్సింగి, నవంబర్ 19 ప్రభాతవార్త : కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామ స్మరణంతో మణికొండ గ్రామం మారుమ్రోగింది. గండిపేట్ మండల పరిధిలోని మణికొండ గ్రామం మొత్తం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప భక్తిగీతాలే వినిపించాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అయ్యప్పస్వామి మహా పడి పూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప స్వాములు లయబద్దంగా హరిహర తనయుడిని స్తుతిస్తూ ఆలపించిన భక్తిగీతాలు ఆహుతులను, స్థానిక ప్రజలను భక్తిసాగరంలో ముంచెత్తాయి. ఈ పూజకు స్థానిక ఏమ్మేల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఏంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణాడ్డి, మణికొండ మున్సిపల్ టీఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి తదితర నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్ని మహా పడిపూజ హారతిని కళ్లకు అద్దుకున్నారు. ఈ సందర్భంగా ఏమ్మేల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైతం ఆధ్మాత్మికతకు యువత పెద్దపీట వేస్తుండడం, మన సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. హిందూ సంస్కృతిలోని ప్రతీ పర్వదినం వెనుక ఓ ఆంతర్యం దాగుంటుందని, అది మానవాళికి, సర్వ ప్రాణులకు మేలు చేసేదిగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం లో పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులతో పాటు వందలాదిమంది భక్తజనం పాల్గొని కరుణా హృదయుడు శబరిగిరీశుడి కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు.

## భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న యానిమల్ వేల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి కిషం మిట్టల్, మహేష్ అగర్వాల్

చార్మినార్, నవంబరు 19 ప్రభాతవార్త : చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని శనివారం యానిమల్ వేల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా నోడల్ అధికారి కిషం మిట్టల్,తెలంగాణ గోశాల ఫెడరే షన్ అధ్యక్షులు మహేష్ అగర్వాల్‌తో పాటు పలువురు సందర్శించారు.శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారు అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రధానీ మోడీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఏకం కావాలి

**ఛత్తీస్‌గడ్ రాష్ట్ర వాణిజ్యపన్నులు, పరిశ్రమల శాఖమంత్రి కొవాసి లక్మా**




ప్రసంగిస్తున్న ఛత్తీస్‌గడ్ రాష్ట్ర వాణిజ్యపన్నులు, పరిశ్రమల శాఖమంత్రి కొవాసి లక్మా

చిక్కడపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త : కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో టిఆర్ఎస్ పార్టీతో పాటు అన్ని పార్టీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఛత్తీస్‌గడ్ రాష్ట్ర వాణిజ్యపన్నులు, పరిశ్రమల శాఖమంత్రి కొవాసి లక్మా అన్నారు. భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమ ఆకాంక్షల సాధన కోసం భారత్ బచావో పేరిట శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మేథోమథన సదస్సు జరిగింది. ఈ సందర్భంగామంత్రి కొవాసి లక్మామాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని, నల్లధనం తీసి ప్రతి ఒక్కటి ఎకౌంట్‌లో రూ.15లక్షల చొప్పున జమచేస్తానని నమ్మించారని అన్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమిచైర్మన్ అల్లం నారాయణ, బిఎస్‌సిఎఫ్ జాతీయ అధ్యక్షుడు ధామన్ మేష్రం, రిటైర్ట్ ఐఎస్ అధికారి ఆకునూరి మురళీ, ప్రొఫెసర్ పిఎల్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రికెట్ పోటీలు
### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 19, ప్రభాతవార్త : క్రీడాకారులను ప్రోత్స హించేందుకే క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం తలసాని యువసేన ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు అమీర్‌పేట జిహెచ్ఎంసి గ్రౌండ్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, సిఐ సైదులు, డివిజన్ ప్రెసిడెంట్ హనుమంతరావు, డివిజన్ జనరల్ సెక్రటరీ సంతోష్ మణికుమార్, అశోక్‌యాదవ్, కూతురు నరసింహా, సచిన్ రాథోడ్, లక్ష్మీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ గంగారెడ్డి

బేగంపేట నవంబరు 19,ప్రభాతవార్త : నగర పరిధిలోని ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ గంగారెడ్డి సూచించారు.శనివారం మహంకాళీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బిహెచ్ ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న ఆటో వాలాలకు ఏసీపీ పలు సూచనలు చేసారు.ఆటో డ్రైవర్లు ముఖ్యంగా బస్ బేల వద్ద ఆటోలను నిలిపి ఉంచరాదన్నారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని,అలాగే ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంటుందన్నారు.అందువల్ల ప్రతి ఒక్కరూ ఆటో స్టాండ్‌లకు నిర్ణయించిన పార్కింగ్‌లోనే ఉండి తమ ప్రయాణాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు.నిబంధనలు ఉల్లంఘిందన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన ఆటో వాలాలను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంట మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నర్సింహ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే పికెట్ గార్డెన్‌లో వనభోజనం : పిట్ల నాగేశ్



విలేకర్ల సమావేశంలో కొరివి క్రిష్ణ స్వామి సేవా సమిత అధ్యక్షులు పిట్ల నాగేశ్

కంటోన్మెంట్, నవంబర్ 19 ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ సమీపంలోని పికెట్ గార్డెన్ మైదానంలో వనభోజన సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొరివి క్రిష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముదిరాజ్ కులస్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## క్రీడలు క్రమశిక్షణ నేర్పిస్తాయి
### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, నవంబర్ 19 ప్రభాతవార్త: క్రీడలు ప్రతి విద్యార్థికి అవసరం అని, క్రమశిక్షణకు క్రీడల ఎంతో దోహదపడుతాయని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో నారాయణ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేష్, ప్రిన్సిపల్ పర్వీన్, వెంకటేష్, స్కూల్ కోఆర్డీనేటర్లు ఆజాద్, లక్ష్మి భవాని,పీఈటీ నరేష్, ఏ ఓ, మహేందర్, జకీర్, పలువురు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

నిజాంపేట్, నవంబర్ 19 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సర్వేనెంబర్ 146లోని 5ఎకరాల భూమి, పార్కును కాపాడాలని ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్‌కు శనివారం బిజేపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజేపి నాయకులు మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ 146 సర్వేనెంబర్‌లో 5.1ఎకరాల ప్రభుత్వం స్థలం ఉన్నట్లు రికార్డుల్లో చూపిస్తుందన్నారు. అయితే ఈ స్థలంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోందని,కానీ ఇందులో ఝాన్సి లక్ష్మీభాయి పార్కు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఎన్నో సంవత్సరాలు ఖాళీగా ఉన్న ప్రదేశంలో ఎలాంటి కోర్టు అనుమతులు కానీ, ఏ ఇతర అనుమతులు లేకుండా గత వారం క్రితం నుంచి పార్కుని కలుపుకొని ఈ స్థలం మాదేనంటూ కొందరు అక్రమార్కులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా రన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఈ విధంగా ప్రభుత్వ భూములు కబ్జాకోరల్లో చిక్కి అన్యాక్రాంతం అవుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బిజేపి అధ్యక్షుడు ఆకుల సతీష్, చంద్రమౌళి, విష్ణు వర్ధన్, సత్యనారాయణ, అశోక్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం
### టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 19, ప్రభాతవార్త : భారతదేశానికి స్వర్గీయ ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం అని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. శనివారం మాజీ ప్రధాని, భారత దేశ ఉక్కు మహిళా, భారత రత్న స్వర్గీయ ఇందిరాగాంధీ 105వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ అధ్యక్షులు చున్ను పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యంశ్రీరంగం ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్ట మొదటి ఏకైక తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, నేటి వరకు కూడా మరో మహిళ ఆ స్థానాన్ని చేపట్టలేదని అన్నారు. రాజ్యసభ ద్వారా ప్రధానమంత్రి పదవి చేపట్టిన వ్యక్తుల్లో మొదటివ్యక్తి, భారతరత్న పురస్కారాన్ని పొందిన మొదటి మహిళగా గుర్తింపు పొందారన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు మాజీ కార్పొరేటర్ వెంగళ్‌రావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, గాలి బాలాజీ, మొయిజ్, వేణు, సంతోష్, నర్సింహాయాదవ్, ప్రకాష్‌ముదిరాజ్, స్వరూపముదిరాజ్, నర్సింహాయాదవ్ పాల్గొన్నారు.

## స్వామి రామానంద తీర్థలో బాలల దినోత్సవం



స్వామి రామానంద తీర్థ మెమోరియల్ లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సినీ తార రోజారమణి,అజిత

బేగంపేట నవంబరు 19,ప్రభాతవార్త : బేగంపేట స్వామి రామానంద తీర్థలో నిర్వహిస్తున్న మోడల్ స్కూలు ద్వారా మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికితీస్తున్నారని, సినితార రోజా రమణి అన్నారు.శనివారం బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబరు 9లోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ లోని మోడల్ స్కూలులో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు రోజా రమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా వారు ఆవరణలోని దివంగత ప్రధాని పీ.వీ.నర్సింహారావు, స్వామి రామానందతీర్థ తదితరులు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో పీ.వీ.మనుమరాలు, శ్రీవెంకటేశ్వరా కాలేజి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ అజిత్ మారంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాలైన స్వాతంత్ర్య సమర యోధులు,ఇతర వేషాధారణలతో అలరించారు. ప్రిన్సిపాల్ వాసుకి,అరుణ, చిన్నారులు పాల్గొన్నారు.

## బిజెపి నేతలపై దాడులు చేయడం టీఆర్ఎస్ సిగ్గుమాలిన చర్య

జీడిమెట్ల, నవంబర్ 19 ప్రభాతవార్త: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై టీఆర్ఎస్ నాయకులు చేసిన దాడిని రాష్ట్ర బిజేపి అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ శనివారం ఖండించారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ బండి సంజయ్‌తో కలిసి ధర్మపురి అరవింద్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో బిజేపి ఎదుగులను చూసి ఓర్వలేక బిజేపి నాయకులపై టీఆర్ఎస్ గూండాలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. బిజేపి పార్టీని ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియని టీఆర్ఎస్ పాలకులు వారి దగ్గర ఉండే గూండాల చేత ఎంపీ అరవింద్‌పై దాడి చేయించడం పిరికిందల లక్షణమన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేస్తే ప్రతి విమర్శలు చేయాలి కానీ ఇలా దాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
### కార్పొరేటర్ సామలహేమ



కుట్టివెల్లోడి ఆస్పత్రిని సందర్శించిన కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్త : రోగులకు వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ అన్నారు. శనివారం సీతాఫల్‌మం డిలోని కుట్టివెల్లోడి ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయో, సిబ్బంది రోగుల పట్ల చూపిస్తున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య, ఎలాంటి జబ్బులతో ఆస్పత్రికి వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగామణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చలికాలం కావడం వల్ల అనేక ఇబ్బందులు వస్తుంటాయని, వాటిని నివారించడం పట్ల అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కార్పొరేటర్ ఆరా



పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సున్నంరాజ్‌కుమార్,మిర్జారహ్మత్‌బేగ్‌లు

పురానాపూల్, నవంబర్ 19 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్,మజ్లీస్ నాయకులు మిర్జా రహ్మత్‌బేగ్‌లు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని దూద్‌బౌలి, సుఖ్‌మీర్‌కమాన్,లైబ్రరీ,ఓవైసీపార్క్ తదితర ప్రాంతాలల్లో అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.లైబ్రరీలో ప్రత్యేక సదుపాయాలను చేయాలని ఆదేశించారు.రహదారుల మరమ్మత్తులతోపాటు మురుగునీటి కాలువలల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలన్నారు. మ్యాన్‌హోల్స్ కవర్‌లను ఏర్పాటు చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈపాదయాత్రలో జలమండలి జిఎం.కృష్ణ, డిజిఎం అబ్దుల్‌హాకీం, మేనేజర్ బాను ప్రసాద్, డిఈ సంగప్ప,ఎ.ఇ.బానుప్రసాద్, నరేష్‌లతోపాటు మజ్లీస్ నాయకులు పాల్గొన్నారు

## 22 నుంచి ఎం.ఎ. చంద్రశేఖర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు



క్రీడా పోటీల మెమోంటోలను ఆవిష్కరిస్తున్న టిఎన్‌జిఓ అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ,ప్రతినిధులు

గన్‌ఫౌండ్రి, నవంబర్19 ప్రభాత వార్త: టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా ఆద్వర్యంలో నిర్వహించే ఎం.ఎ చంద్రశేఖర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు ఈనెల 22నుంచి మొదలు కానున్నాయని యూనియన్ అధ్యక్షులు ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ తెలిపారు. ఈమేరకు ఈనెల 22న ప్రారంభమై 26వరకు కొనసాగుతాయన్నారు.జింఖానా మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇందులో 26జట్లు పాల్గొంటాయన్నారు. విన్నర్, రన్నర్‌లకు బహుకరించే ట్రోఫిలను తైవాన్‌లో ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించడం జరిగిందన్నారు.క్రీడలకు అనుమంచిన క్రీడాశాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ అమోయ్ కుమార్‌లతోపాటు టిఎన్‌జిఓరాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజేందర్, ప్రధానకార్యదర్శి ఆర్.ప్రతాప్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్ ముజీబ్‌హుస్సేనీ శాలువ కప్పి సన్మానించారు. అనంతరం నాలుగవ తరగతి అధ్యక్షులు జ్ఞానేశ్వర్,కార్యదర్శి ఖాదర్‌బిన్‌హాసన్‌కలసి ఈనెల22వ తేదినుంచి క్రీడాపోటిలకు సంబంధించిన డ్రా తీశారు. ఈ సమావేశంలో విక్రమ్‌కుమార్, కెఆర్.రాజ్‌కుమార్, ఎస్.మురళీరాజ్,కె.శ్రీని వాస్,శేఖర్,రాజేందర్, తూముకుంటరాజు, ప్రభాకర్,ముఖీంఖురేషీ,శ్రీధర్,జహంగీర్ అలీ,ఎమ్‌డి.వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి





వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.నర్సింహా

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.నర్సింహా పిలుపుచేశారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పదేపదే ధరలు పెరుగుదల, పరిశ్రమలు మూసివేత, ఉపాధి అవకాశాలు తగ్గింపు, వేతనాలలో వివక్ష మొదలైనాయని, కార్మికుల జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 27, 28, 29 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐటి యుసి రాష్ట్ర 3వ మహాసభల వాల్‌పోస్టర్‌ణు నర్సింహా ఆవిష్కరించి మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలలో కార్మికుల స్థితిగతుల, సవాళ్ళు, కార్మిక వ్యతిరేరక లేబర్ కోడ్‌లు, వలస కార్మికుల డిమాండ్లు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు, అణిచివేత తదితర అంశాలపై చర్చించి ఆందోళనా కార్యక్రమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వెంకటయ్య, బోడ్డుపల్లి కిషన్, హసినాబేగం, ఎం.లక్ష్మి, ఆర్.మల్లేష్, కొమురవెల్లి బాబు,ఎం శ్రీనివాసమూర్తి, బిక్షపతియాదవ్, రాజమౌళి పాల్గొన్నారు.

## జిఎస్టీ భారంతో కేంద్రం రైతుల నడ్డి విరుస్తున్నది

సైఫాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలు, రైతుల నడ్డి విరిచేలా జిఎస్టీ వసూలు చేస్తున్నదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. బిజెపి ఎనిమిదేళ్ళ పాలనలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ఎరువులు, క్రిమిసంహారిక మందులు తదితర వస్తువులపై జిఎస్టీ విధించి వేధింపులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. రైతు బిడ్డలు పోరాడి సాధించుకున్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం లేదని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలేదని, రైతుల రుణాలను మాఫీ చేయడం లేదని, విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని, చేనేతపై విధించిన జిఎస్టీని ఎత్తివేయాలని ఆయన మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు.

## గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.బాలరాజు

హైదరాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా అండర్/19 జూనియర్ కళాశాల గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సికింద్రాబాద్ సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫీజికల్ డైరెక్టర్ ఎ.బాలరాజు నియమితులైనారు. హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో శనివారం హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.ఒడ్డెన్న ఆధ్వర్యంలో జరిగిన జిల్లా జూనియర్ కళాశాలల సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఎ.బాలరాజు 2022-2024 సంవత్సరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొనసాగుతారు. ఈ సందర్భంగా డి.ఒడ్డెన్న మాట్లాడుతూ ఫిజికల్ డైరెక్టర్లు అంకిత భావంతో విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. హైదరాబాద్ జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారని వారిలో దాగిఉన్న క్రీడా స్ఫూర్తిని గుర్తించి ప్రోత్సహం అందించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న క్రీడా వనరులను వినియోగించుకుని మన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన కోరారు.

## వృత్తికులాలకు పెద్దకులాలతో సమప్రాధాన్యత కోసం పోరాటం అవసరం : ఎమ్మెల్యే ఈటెల రాజేందర్



కార్యక్రమంలో పాల్గొన్న హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్, వంగాల బాల్‌రాజ్‌గౌడ్

చిక్కడపల్లి, నవంబరు 19 ప్రభాతవార్త: తెలంగాణ బడుగు, బలహీనవర్గాల రాష్ట్రమని, వృత్తికులాలకు పెద్దకులాలతో సమప్రాధాన్యత కోసం పోరాటం అవసరమని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. ఆదర్శకిరణం నూతన మాసపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేత, ఆదర్శవాణి, ఆదర్శ కిరణం మాసపత్రిక ప్రధాన సంపాదకులు వంగాల సుజాత బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పత్రికను ఆవిష్కరించిన అనంతరం ఈటెల రాజేందర్‌మాట్లాడుతూ దేశంలో కుటుంబ పాలన నుంచి విముక్తి, బడుగువర్గాలకు గుర్తింపు పొందుతున్న వాతావరణం కనిపిస్తోందని అన్నారు. ఇందుకు నిదర్శనం కేంద్ర కేబినెట్‌లో 27 మంది మంత్రులు, ఓబీసీ వర్గాలవారేనని అన్నారు. రాష్ట్రపతి అణగారినవర్గాల వారు కాగా ప్రసుత్తుతం ఆదివాసీ బిడ్డకావటం ప్రధానమంత్రి మోదీ వల్లనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, సుధాకర్, కార్పొరేటర్ మహాలక్ష్మి దంపతులు, ధనుంజయ్, కవి చిక్కారామదాసు, గడ్డమీది అనూరాధ పాల్గొన్నారు.

## బాలమిత్రలో టీచర్లదే కీలక పాత్ర
### సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర



బాలమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి, నవంబరు 19 ప్రభాతవార్త : సైబరాబాద్ పోలీసులు చేపట్టిన బాలమిత్ర బాలల రక్షణ కోసం పాటుపడుతుందని, బాలమిత్రలో టీచర్లదే కీలకపాత్ర అని సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సైబరాదాద్ కమీషనరేట్‌లో 2019లో ప్రారంభించిన బాలమిత్ర కోవిడ్ మహమ్మారి కారణంగా విరామం రావడంతో శనివారం ఈ కార్యక్ర మాన్ని పున :ప్రారంభించారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యా లయం శాంతి సరోవర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమీషనరేట్ పరిధిలోని డిసిపిలు శిల్పావల్లి, కవిత, లావణ్య, ఎస్సీఎస్సీ ప్రధాన కార్యదర్శి క్రిష్ణ ఏదులతో కలిసి కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షీటీమ్‌ల ఏర్పాటుతో మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. చిన్నారులు, విద్యార్థులపై ఇటీవలి కాలంలో జరుగుతున్న ఆకృత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ స్కూల్‌లో చిన్నారి మీద జరిగిన లైంగిక దాడి, శంకర్‌పల్లిలోని ఓ కళాశాలలో జరిగిన ర్యాగింగ్ ఉదంతం సమాజాన్ని నివ్వెరపరిచిందన్నారు. చాలా వరకు ఇటువంటి సంఘటనల్లో బాధితులు మైనర్లు కావడం, విషయం బయటకు తెలిస్తే కుటుంబ పరువు పోతుందని పెద్దలు భావించడంతో పోలీసులకు పిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. బాధితులు ధైర్యంగా ముందుకు వస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి న్యాయం చేసేందుకు పోలీసులు సిద్దంగా ఉంటారని తెలిపారు. బాలమిత్ర కార్యక్రమంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. 2019లో బాలమిత్ర ప్రారంభించిన అనంతరం ఉపాధ్యాయుల ద్వారా 58 ఆర్జీలు అందాయని, వీటిలో 3 ఫోక్సో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాటిజ్ బ్యాడ్ టచ్, వాటిజ్ గుడ్ టచ్ అనే విషయంలో చిన్నారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పాలన్నారు. బాలమిత్రలో భాగంగా ప్రతి పాఠశాల నుంచి ఓ కౌన్సిలర్‌ను ఎంపిక చేసి మంచి, చెడుల మీద చిన్నారులను చైతన్యం చేస్తామన్నారు. నేరం జరిగిన తరువాత నేరస్థులను శిక్షించడం కన్నా, నేరం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ఉత్తమమన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





మాదాపూర్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధిగా మావులేటి

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 19, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా కెపిహెచ్‌బి కాలనీకి చెందిన మావులేటి వెంకటరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డిని శనివారం మావులేటి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హరీష్‌రెడ్డి మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతంలో బిజెపి బలోపేతానికి శక్తి వంచనతో కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియమించినందుకు నిస్వార్థంగా సేవలందిస్తానని వెంకటరాజు హామి ఇచ్చారు.

## 21న ముదిరాజుల మహాసభ



పేట్‌బషీరాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ను తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈనెల 21న ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం, ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా- ముదిరాజ్ గుండెల్లో చైతన్య ఎజెండా మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఎమ్మెల్యేని ఆహ్వానించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మల స్వామిముదిరాజ్, గుమ్మడి మధుసూధన్‌రాజ్, తోడేటి సత్యం ముదిరాజ్, శ్రీనివాస్, కృష్ణ, ప్రకాష్ శివకుమార్, నర్సింహ, విజయ్, వెంకటేష్, రాములు, సత్తయ్య, మల్లేష్, రాయలపురం కృష్ణ, గణేష్, భాగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ కార్యక్రమంలో కొబ్బరికాయ కొడుతున్న కార్పొరేటర్ కొలన్ మీనారెడ్డి

నిజాంపేట్, నవంబర్ 19 ప్రభాత వార్త: జర్నలిస్టు కాలనీవాసులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమస్య పరిష్కారానికి శనివారం ఉదయం శంకుస్థాపనతో తెర పడింది. కార్పొరేటర్ కొలన్ మీనా సునీల్‌రెడ్డి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌లతో చర్చించి ఎట్టకేలకు జర్నలిస్టు కాలనీ నుంచి శ్రీశ్రీశ్రీ చర్ల ఎల్లమ్మతల్లి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు శ్రీశ్రీశ్రీ చర్ల ఎల్లమ్మతల్లిని దర్శించుకోవడానిక భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాహనదారులు, పాదాచారులు రోడ్డులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకొని నియోజకవర్గ నాయకులు అధికారులతో చర్చించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానన్నారు.

## మహిళా సాధికారతకు కృషి అభినందనీయం
### సినీ నటి అనసూయ భరద్వాజ్

హైదరాబాద్, నవంబర్ 19,ప్రభాతవార్త: మహిళా అభ్యున్నతికి, సాధికారతకోసం స్వచ్ఛందసంస్థలు ముందుకురావడం అభినందనీయమని సినీనటి అనసూయ భరద్వాజ్ అన్నారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్‌లో ఆర్‌మీడియా స్వచ్ఛంద సంస్థ పేరుతో సత్యవతి ప్రసన్న ఏర్పాటు చేసిన స్వచ్ఛందసంస్థ లోగోను అనసూయ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఉపాధికోసం, వారి అరోగ్యం కోసం ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో మంచి పరిణామమని వీరిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. సంస్థ చైర్‌పర్సన్ సత్యవతి ప్రసన్న మాట్లాడుతూ తాము గత పదిసంవత్సరాలుగా మహిళల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన ఎంతోమంది మహిళలకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి పలు పనుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామన్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎంతోమంది మహిళలకు తమసంస్థ ద్వారా ఉచిత సేవలు అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐ సునీత, సినీనటుడు యాంకర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## నృత్యాంశాలతో ముగ్ధమనోహరంగా అనిక బృంద గురువందనం

రవీంద్రభారతి, నవంబరు 19 ప్రభాతవార్త : అభినయ కూచిపూడి కళాక్షేత్రం సమర్పణలో సంస్థ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థకు చెందిన కె.ఎల్.అనిక తదితర కళాకారిణుల బృందం వివిధ నృత్యాంశాలు రంగపూజ-వినాయకకౌతం; పుష్పాంజలి; ఆధ్యాత్మ రామాయణ కీర్తన నమఃశివాయతే; జతిస్వరము; భద్రాచల రామదాసుకీర్తన ఇదిగో భద్రాద్రి; రామాయణ శబ్దం; మండూకశబ్దం; దశావతారశబ్దం; యతినారాయణతీర్థ విరచిత తరంగం కృష్ణం కలయసఖి తదితరాలను శృతి లయబద్ధంగా, అద్భుతమైన హావభావాలను, హస్త పదకదలికలతో ముగ్దమనోహరంగా నర్తించి గురువందనం కావించి ప్రేక్షకులను అలరించి మంత్రముగ్ధులను చేశారు.

# రూ.2 కోట్ల 80లక్షలతో అభివృద్ధి పనులు : మంత్రి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బేతి, శ్రీలత, బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త :** గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిఎం కెసిఆర్, మంత్రి కేటిఆర్ నాయకత్వంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, డిప్యూటి మేయర్ మోతే శ్రీలతరెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.2 కోట్ల 80లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు, ట్రాఫిక్ రద్దీ నివారణకు పలుచోట్ల కొత్త ఫ్లైఓవర్లు, లోతట్టుప్రాంతాల్లో వరద ముంపు సమస్య అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎస్సీ స్మశానవాటిక సందర్శించి పలు అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. అధికారుల తీరుపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, డిసి అరుణకుమారి, ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఇంజనీర్ నాగేందర్, జలమండలి మేనేజర్ సత్యానారాయణ, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, వి.బి.నరసింహా, కొక్కొండ జగన్, కొంపల్లి రవీందర్ ముదిరాజ్, పిట్టల నరేష్ ముదిరాజ్, మాస శేఖర్, అబ్బూబాయ్, అశోక్‌చారి, రామానుజం, కిషన్, మహేందర్, రవీందర్‌గౌడ్, గూడూరి రమేష్, పోచయ్య, రమేష్, బాలు, మహిళా నాయకురాలు సరిత, సైనాజ్, అండాలు, లక్ష్మి, సత్యవతి, ఉమా, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ జయంతి


ఇందిరాగాంధీకి నివాళులర్పించిన మేయర్ పారిజాత, నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో శనివారం మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి జయంతి ఘనంగా జరిగింది. కార్పొరేషన్ కాంగ్రెస్‌అధ్యక్షుడు పెద్దబావిఆధ్వర్యంలో బడంగ్‌పేట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్ద బావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, బండారి మనోహర్, పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, ఎర్ర జైహింద్, బాల్‌నింగని జంగయ్య, పుట్టగళ్ళ జగన్, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, గొరిగె శ్రీశైలం, అమృతానాయుడు, సుభాన్ యాదవ్, సూర్ణగంటి విజయ్, వెంకట్‌గౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి ఇంటిపై దాడికి నిరసనగా ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం


కవిత దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** ఎంపి ధర్మపురి అరవింద్ నివాసంపై దాడికి నిరసనగా శనివారం బడంగ్‌పేట్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిష్టిబొమ్మను దహనం చేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డిఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన బిజెపి నాయకులు, కార్యకర్తలు అరవింద్ ఇంటిపై దాడిని ఖండిస్తూ కవిత దిష్టిబొమ్మను దహనంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్, ఎమ్మెల్సీ కవిత ఆదేశాలతోనే టిఆర్ఎస్ గుండాలు హైదరాబాద్‌లోని తమ ఎంపి ఇంటిపై దాడి చేసి అరవింద్ తల్లిని బెదిరించి భీభత్సం సృష్టించారని ఆరోపించారు. దాడులకు బిజెపి భయపడదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్య రామాలయ ప్రాంగణములో శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామి వ్రతం ఫణిశర్మ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, మమత, సరిత,రాళ్ళబండి వేణుగోపాల్‌రావు, సత్యరెడ్డి, రామమూర్తి, వన్నడీ శ్రీనివాస్, జనార్ధన్, కృష్ణా, ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు, చంద్రయ్య, నరేష్, నిత్య, జ్యోతి, రజనీ, శిరీష్, ప్రశాంతి పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడి పూజ


రామ్మోహన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నర్సింగ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** మహాశాస్త శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమం పిల్లాయిపల్లి నర్సింగ్ నివాసంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగోల్ గ్రామంలో పిల్లాయిపల్లి నర్సింగ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీఅయ్యప్పస్వామి మహాపడిపూజా అయ్యప్పస్వామి భక్తుల కోలాహలం మధ్య అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ మహా పడిపూజా కార్యక్రమానికి ఎల్బీనగర్ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌గౌడ్‌ను శాలువాతో పిల్లాయిపల్లి నర్సింగ్ సత్కరించారు. ఈ పూజా కార్యక్రమంలో మహేష్ గురుస్వామి, శ్రీశైలంస్వామి, చెరుకు సంతోష్‌గౌడ్, నల్లవెల్లి శ్రీనుస్వామి, సగ్గు వేణుస్వామి, పిలాయిపల్లి జంగయ్య, చెంచల శ్రీనివాస్, పంగ సికింధర్, చిరంజీవిస్వామి పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దడానికి కృషి : సుభాష్‌గౌడ్



ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

**మలక్‌పేట, నవంబరు 19 ప్రభాతవార్త :** విద్యార్థులను భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట శ్రీవాణి ఉమెన్స్ కళాశాల కరస్పాండెంట్ ఎం. సుభాష్‌గౌడ్, ఛైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట సిమ్లా గార్డెన్స్‌లో శ్రీ వాణి కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ అత్యుత్తమ అధ్యాపక బృందంచే అధునాతన పద్దతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ,వారి భవిష్యత్తు బాటలు వేస్తున్నామన్నారు. విద్యార్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమాజంపై అవగాహన కూడా పెంపొందించుకోవాలన్నారు. తమ కళాశాలలో చదివిన పలువురు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విమలారెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, శ్రీలక్ష్మి, దామిని, బింధు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారుగా వార్డు అభివృద్ధి : కౌన్సిలర్ కాకుమాను సునీల్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సునీల్ తదితరులు

**తుర్కయంజాల్, నవంబరు 19 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 18వ వార్డు శాంతినగర్ కాలనీలో సిసి రోడ్డు పనులకు తెలంగాణ పిసిసి సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్ ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి, సహాయ సహకారాలతో 10 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. కాలనీలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనుల కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కే.ప్రభాకర్, రాజేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కే.ఆరోగ్యం, పి.వినయ్, శోభన్‌బాబు, శ్రీనివాస్‌శర్మ, మహేష్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి అరవింద్ ఇంటిపై టిఆర్ఎస్ నాయకుల దాడి హేయమైన చర్య


కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 19 ప్రభాతవార్త:** ఎంపీ ధర్మపురి అరవింద్ ఇంటిపై టీఆర్ఎస్ గుండాల దాడిని నిరసిస్తూ బీజేపీ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేసి అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల ఆగడాలు పెరిగిపోయాయని, రాష్ట్రాన్ని సొంత జాగీరులా భావిస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే గుండాలు దౌర్జన్యం చేస్తున్నా పట్టిపట్టనట్లుగా ఉండడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. టీఆర్ఎస్ దాడి హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. ఇలాంటి చర్యలు మానుకోని పక్షంలో తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంట ప్రభాకర్‌రెడ్డి, షకీల్‌మీర్జా, గంటలక్ష్మారెడ్డి, బిక్షపతి, శంకర్‌రెడినడ, మధుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## వివేకానంద కాలనీలో విద్యుత్ దీపాల ఏర్పాటు : లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, నవంబరు 19 ప్రభాతవార్త :** శివారు కాలనీలలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానంద కాలనీలో వీధి దీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలియజేయడంతో శనివారం లచ్చిరెడ్డి కలనీలో పర్యటించి జిహెచ్ఎంసి సిబ్బందితచే విద్యుత్ దీపాల ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన కాలనీలలో విద్యుత్ దీపాల ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ టాయిలెట్లను వాడి పర్యావరణాన్ని కాపాడాలి


పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహకులను సన్మానిస్తున్న చెవుల స్వప్న, కమిషనర్ రామాంజులరెడ్డి

**హయత్‌నగర్, నవంబరు 19 ప్రభాతవార్త :** బహిరంగ ప్రదేశాలలో మల,మూత్ర విసర్జనను పూర్తిగా మానుకోవాలని ప్రజా మరుగుదొడ్లను వినియోగించుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవులస్వప్న, కమిషనర్ రామాంజులరెడ్డి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహకులను వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మరుగుదొడ్ల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. అనంతరం వారు మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర సురేష్ పాల్గొన్నారు.

## తెలంగాణలో అబద్ధపు పాలన: దేప

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సిఎం కేసీఆర్ అబద్ధపు పాలన కొనసాగిస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టి సెల్ సెక్రెటరీగా నియామకమైన ఇస్లావత్ ఆంజనేలు శనివారం దేప భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డిలను కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, దశరథనాయక్, శ్రీనునాయక్, జన్యనాయక్, రమేష్‌నాయక్, కుమార్‌నాయక్, సంతోష్‌నాయక్, శివ నాయక్, ఉపేందర్‌నాయక్ పాల్గొన్నారు.

## గుర్రంగూడ, రాజీవ్‌గృహకల్పలో మేయర్ పారిజాత పర్యటన

**సరూర్‌నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 6వ డివిజన్ గుర్రంగూడ శ్రీనివాసపురం, 25వ డివిజన్‌లోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్ప కాలనీల్లో శనివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీనివాసపురం కాలనీవాసులను స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో 6వ డివిజన్ కార్పొరేటర్ దడిగ శంకర్, ఎఇఇ రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు ముత్యాల కృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం : జక్కిడి

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని టీపిసిసి కార్యదర్శి ఎల్బీనగర్ ఇంఛార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 102వ జయంతి సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి ప్రభాకర్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిబి హటావో అంటూ ఇందిరాగాంధీ పేదరిక నిర్మూలన కోసం కృషి చేశారని తెలిపారు. పద్నాలుగు బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతున్నన్నారు.

## దళితబంధు దేశానికే అదర్శం : ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరేడ్‌మెట్, నవంబర్ 19 ప్రభాతవార్త:** సిఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకం దేశానికే అదర్శమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. శనివారం మౌలాలి డివిజన్ చంద్రకాంత్‌నగర్‌లో దళితబంధు పథకం ద్వారా ఏర్పాటు చేసిన జనరల్ స్టోర్‌ను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టలేని పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని దీంతో ఎంతో మంది దళితులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, టిఆర్ఎస్ నాయకులు జిఎన్‌వి సతీష్‌కుమార్, సత్తయ్య, ఆదినారాయణ, సంతోష్ నాయుడు, మంద భాస్కర్, శైలేందర్, సందీప్, దుర్గేష్, నవాబ్, రాజు, జానీ, నాగరాజు, గీతగుప్త తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం : కార్పొరేటర్ శ్వేత


బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, నవంబరు 19 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ నాగార్జున కాలనీలో రూ.13లక్షల వ్యయంతో చేపడుతున్న బిటి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపా ధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు ప్రమోద్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, విక్రమ్, గిరిధర్‌రెడ్డి, ఎఇ అన్సారి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అరవింద్‌ను కలిసిన శ్రీవాణి


ఎంపీ అరవింద్‌ను కలిసిన కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** అధికారం, అహంకారంతో ఎవరు ఏది సాధించలేరని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంపీ అరవింద్ నివాసంపై దాడి చేయడానికి కార్పొరేటర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్‌ను కలిసి ఆమె పరామర్శించారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై టిఆర్ఎస్ ప్రభుత్వం దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ తన పద్దతి మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## స్మశానవాటిక పనుల్లో అధికారుల నిర్లక్ష్యంపై మేయర్ ఆగ్రహం


చిలుకానగర్ శ్మశానవాటికను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, మోతే శ్రీలతరెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త :** చిలుకానగర్ ఎస్సీ స్మశానవాటికలో సదుపాయాలు కల్పనలో అధికారుల నిర్లక్ష్యంపై నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చిలుకానగర్‌లో వివిధ అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన మేయర్ విజయలక్ష్మి ఎస్సీ స్మశానవాటికను పరిశీలించారు. స్మశానవాటికలో బాత్‌రూమ్‌లకు డోర్‌లు లేవని, నీటి సదుపాయం లేదని, మురుగునీటి సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడే ఉన్న జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఇ అశోక్‌రెడ్డి దృష్టికి సమస్యలు వివరించారు. అధికారులు స్మశానవాటికలో సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదని, మురుగునీరు లోపలికి వస్తున్నా ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాడల్ స్మశానవాటికగా చిలుకానగర్ స్మశానవాటిక తీర్చిదిద్దుతామని ఆమె స్పష్టం చేశారు. జలమండలి అధికారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో వారం రోజుల్లో తిరిగి వస్తానని, పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని హెచ్చరించారు. తక్షణమే బాత్‌రూమ్ డోర్లు, నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ మోతే శ్రీలతరెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, జోనల్ కమిషనర్ పంకజ, డిసి అరుణకుమారి, ఎస్ఇ అశోక్‌రెడ్డి, ఇంజనీర్ నాగేందర్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, వి.బి.నరసింహా, కొక్కొండ జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల


అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట,నవంబరు 19 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సైదాబాద్ డివిజన్ ఎల్‌సిహెచ్ కాలనీలో రూ. 35 లక్షలతో నిర్మించిన మంచినీటి పైప్‌లైన్ డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అదే విధంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సిహెచ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి సూర్యం, సభ్యులు వెంకటేశం, సలీం, మజ్జు, నాయకులు జావేద్, కృష్ణ, నాగరాజు, సుమంత్‌తోపాటు అధికారులు మహబూబ్‌మియా, వెంకన్న, శీలారాణి, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు


జెండాను ఆవిష్కరిస్తున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

**తుర్కయంజాల్, నవంబరు 19 ప్రభాతవార్త :** తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం ప్రదాన కార్యాలయంలో సంఘ అధ్యక్షులు, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యచే సహకార పతాక ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజనులు, స్త్రీలు బలహీన వర్గాలకు సంఘం సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వంగేటిలక్ష్మారెడ్డి, కొత్తరాంరెడ్డి, సామ సంజీవరెడ్డి, కూతడి నర్సింగరావు, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, కందాడి లక్ష్మారెడ్డి, సంఘం సీఈఓ వై.రాందాస్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగోల్ డివిజన్ ప్రగతికై అధికారులతో సమీక్షా సమావేశం

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ రాక్ టౌన్‌లోని వార్డ్ ఆఫీస్ లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం సమీక్షా సమావేశం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో మిగిలిపోయిన సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వాటర్ డ్రైన్ పనులకు త్వరలో టెండర్ లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ హరి కృష్ణయ్య, అదికారులు శ్రీనివాస్, సుష్మిత, రమేష్ బాబు, బలరాం పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం

**ఎల్.బి.నగర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలేదని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని శ్రీశంకర్ కాలనీలో నూతన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపడుతున్నారని తెలిపారు. తగిన నాణ్యత పాటించకపోవడతో కేవలం మూడు సంవత్సరాలకే పైకప్పు ఒక్కొకటిగా కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం జరిపిన కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

## విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, నవంబర్ 19 ప్రభాతవార్త:** విద్యకోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకొని అందరికి ఉచితంగా విద్య అందేవిదంగా చర్యలు తీసుకుంటున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. మైనార్టీ వెల్ఫేర్ డే, నేషనల్ ఎడ్యూకేషన్ డేను పురస్కరించుకొని నాచారంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పాల్గొని మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ స్కూల్లో ఎంతోమంది చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారు పిల్లలతో కలిసి బోజనం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేష్మ, నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, గడ్డం విఠల్ యాదవ్, రవీందర్‌రెడ్డి, మహేష్, రామకృష్ణ, రవి, తిరుపతి, శ్రీరాం సత్యనారాయణ, దాసరి కర్ణ, వాసు, విష్ణు, కృష్ణ తధితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మేయర్‌కు వినతి


మేయర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, నవంబరు 19 ప్రభాతవార్త :** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీలలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. డివిజన్‌లోని శివారు కాలనీల ప్రజలు రోడ్ల నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే నిధులు విడుదల చేయాలని మేయర్‌కు కార్పొరేటర్ వివరించారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి:భాగ్యలక్ష్మి


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, నవంబరు 19 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని సలీంగనర్ గణేష్ టెంపుల్ నుండి బాలదానమ్మ బస్తీవరకు పాదయాత్ర చేసి స్థానికప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్త, మట్టి దిబ్బలను తొలగించాలని, నూతన డ్రైనేజీ నిర్మాణం, రోడుడ వేయాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె స్పందించి వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ నర్సింగ్, నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మోహన్ రెడ్డి, యాదగిరి, సురేందర్, కొప్పుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు

**వనస్థలిపురం, నవంబరు 19 ప్రభాతవార్త :** వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సచివాలయనగర్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక మాస వన భోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతములు నిర్వహించబడతాయన్నారు. అనంతరం వన భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజయ్‌కుమార్ తెలిపారు.

## ఉప్పల్‌లో ఘనంగా స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు


ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

**ఉప్పల్, నవంబరు 19 ప్రభాతవార్త :** మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలు శనివారం ఉప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పలువురు పార్టీ నేతలు సందర్శించి పూజమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు మేకల శివారెడ్డి, ఎం.డి.తౌఫిక్, నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, బోరంటపేట కృష్ణ ముదిరాజ్, చరణ్, కౌశిక్, డివిజన్ అధ్యక్షులు కాలేరు జైనవీన్, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తెల్కల మోహన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్, జలీల్‌పాషా, షేక్ మదర్‌వలీ, అనంతరం వారు మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. బ్యాంక్‌ల జాతీయకరణతోపాటు, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు.